# జీవనకలశం

"బాబుగారూ! మీ కోసం ఎవరో వచ్చారు"

తలవంచుకుని భగవద్గీతా పఠనం చేస్తున్న నేను తలెత్తాను.

ఎదురుగా రామయ్య చేతులు కట్టుకొని నిలబడి సమాధానం కోసం చూస్తున్నాడు.

"ఎవరు రామయ్యా?" అడిగాను.

"తెలీదు బాబు! పండు తమలపాకులా ఉన్నారావిడ!"

"లోపలికి రమ్మను". వేద పీఠంలో ఉన్న భగవద్గీతలో నేను చదువుతున్న పేజీకి ఆనవాలుగా కాగితం ముక్కను పెట్టి దానిని ప్రక్కకు జరిపి విశాలంగా కూర్చుని చాపను ఒక ప్రక్క ఖాళీగా ఉంచాను.

ఆమె లోపలకు వచ్చింది. చేతిలో చిన్న మూటతో -

నా వెనుక గోడకు ఉన్న ట్యూబ్‌లైటు కాంతి ఆమె దగ్గరకు వస్తున్న కొద్దీ ఆమె రూపాన్ని స్పష్టం చేయసాగింది.

నిజంగానే ఆమె పండు తమలపాకులా ఉంది. వడలిన శరీరంలో బిగి తగ్గిపోయినా జిగి తగ్గలేదు. ఆమె కళ్లు తెల్లని స్ఫటిక కర్పూరాన్ని పోలి ఉన్నాయి. నెరసిన కనుబొమ్మల మధ్య అర్ధరూపాయంత కుంకుమబొట్టు ఆమెకు ఎనలేని నిండుదనాన్ని కలిగిస్తున్నా, గుంటలు పడిన కనుల వెనుక అనుభవాల లోయల్లో



మెరుస్తున్న భావాలు ఆమె ముఖకవళికలను జాలి గొలిపేలా చేస్తున్నాయి.

"స్వామీ! నన్ను గుర్తు పట్టారా!"

నేను కళ్లజోడు సవరించుకొని నా దృష్టంతా కేంద్రీకరించి చూశాను.

క్రమంగా నాకళ్లల్లో విరుస్తున్న భావాలను ఆమె అర్థం చేసుకున్నట్టుగా తలవూపింది. నెమ్మదిగా అన్నాను.

"నర్మదా!"

ఆమె ఏడుస్తూ ఒక్కసారి నా కాళ్లకు చుట్టుకుపోయింది.

వార్ధక్యం వల్లనేమో నా కళ్లు కూడా చమర్చాయి.

నెమ్మదిగా ఆమెను లేపి కళ్లు తుడిచాను.

"నన్ను...నన్ను క్షమించండి! నేను ఘోరమైన తప్పు చేశాను. మిమ్మల్ని ఏ భార్యా అవమానించనంతగా అవమానించాను. తల్లిలాంటి అత్తయ్యగారిపై లేనిపోని అభాండాలు వేశాను. ఏ పరిస్థితిలో మనిషి మాట్లాడినా ఎదుటివారి స్థానంలో మనం ఉండి మాట్లాడితే అవతలవారి మాట మనను ఎంతగా నొప్పిస్తుందో అర్థం అవుతుందని

మీరు స్వానుభవంతో చెప్పిన మాటలు చెవికి ఎక్కించుకోలేక ఈ రోజు కొడుకుచేత గెంటివేయబడి తిరిగి మీ నీడన బ్రతకడం కోసం వచ్చాను. నన్ను క్షమిస్తారు కదూ." అందామె వెక్కుతూ.

"జరిగిందేదో జరిగిపోయింది. అవన్నీ ఇప్పుడు ఎందుకు నర్మదా!" అన్నాను నెమ్మదిగా.

ఆమె నా భుజం మీద తలవాల్చి మళ్లీ అంది.

"లేదండీ! నా పాపానికి ప్రాయశ్చిత్తం లేదు. నేను ముందు అత్తయ్యగారి కాళ్లమీదపడి క్షమాపణ వేడుకోవాలి. అత్తయ్యగారు ఎక్కడ?"

నేను పూజగది వైపు చూపించాను.

"అదిగో! అమ్మ పూజలో ఉంది. లలితానహస్రం ఎంతో శ్రావ్యంగా చదువుతోంది వినపడడం లేదూ?" అన్నాను.

ఆమె రెండు నిమిషాలు మౌనం వహించి విన్నది.

పూజగదిలోంచి మంద్రస్థాయిలో శ్రావ్యంగా అమ్మ కంఠం ప్రతిధ్వనిస్తోంది.

నర్మద మొహం - రాలిపోతూ కూడా జీవం నింపుకున్న పువ్వులా ఉంది.

నా పాదాలకు నమస్కరించి ఆమె పూజగదిలోకి వెళ్లింది.

ఆమె వెనుకనే నా మనసు ఇరవైఏళ్లు వెనక్కు పరుగెత్తింది.

★★★

ఆరోజు నాకింకా బాగా గుర్తుంది.

నేను కాంప్ నుంచి వచ్చేసరికి అమ్మ తీవ్ర జ్వరంతో బాధపడుతోంది.

నర్మద ఇంట్లో లేదు. పిల్లలిద్దరూ స్కూలుకు వెళ్లినట్టున్నారు.

అమ్మ నిద్రలోనే కలవరిస్తుంది.

"బాబూ! మురళీ! నువ్వు తొందరగా వచ్చేయ్యరా నాకు బెంగగా ఉందిరా పాపం నావల్ల నర్మద ఇబ్బంది పడుతోంది భర్త పోయాక ఆడది బ్రతికి ఉండకూడదురా నువ్వు తొందరగా వచ్చెయ్యరా"

నా కళ్లల్లో గిర్రున నీళ్లు తిరాగాయి.

గబగబా అమ్మని డాక్టరు దగ్గరకు తీసుకువెళ్దామని దుప్పటి తీసి ఆమె కంఠం క్రింద చెయి ఉంచాను.

ఆమె ఒళ్లు కాలిపోతోంది.

"నర్మదా!" ఒక్క అరుపు అరిచాను.

ఎక్కడా సమాధానం లేదు. వంటిల్లు, పెరడు, హాలు, వీధిగది అన్నీ వెదికాను. నర్మదలేదు.

అమ్మను వదిలి ఎక్కడకు వెళ్లింది అసలు?

ఆ క్షణంలో నర్మద మీద విపరీతమైన కోపం వచ్చింది.

రిక్షాలో అమ్మని తీసుకొని మా విలేజికి రెండు కిలోమీటర్లు దూరంలో ఉన్న టౌనుకు తీసుకువచ్చాను.

డాక్టరు అన్ని పరీక్షలూ చేశాడు.

"ఎందుకైనా మంచిది స్కానింగ్ కూడా చేయించండి" అన్నాడు.

సరేనన్నాను.

స్కానింగ్, అన్ని రకాల టెస్ట్‌ల రిపోర్ట్స్ వచ్చాయి.

డాక్టర్ చెప్పిన మాటలు వింటుంటే కొయ్యబారిపోయాను.

అమ్మకు హెచ్.ఐ.వి. పాజిటివ్ ఎటాక్ అయింది.

ఆరునెలలకు పైగానే అయి ఉంటుందట.

నాకు దుఃఖం ఆగలేదు.

అమ్మ నా కోసం ఎంత కష్ట పడిందో నాకు తెలుసు. ఆమె కడుపున పుట్టిన నలుగురు పిల్లలలో బ్రతికి బట్టకట్టిన వాడిని నేనే. ప్రపంచంలోని ప్రేమని తన మాతృత్వంతో కలిపి పెంచిన ఉత్తమ ఇల్లాలు. నేను ఏం కోరినా అరగంటలో ఏర్పాటు చేసేది. అందుకోసం ఎంత ఖర్చయినా సరే. ఎంత శ్రమపడైనా సరే! నాన్నగారు కోర్టు గుమాస్తాగా చేసేవారట. మెదడులో నరాలు చిట్లి హఠాత్తుగా మరణించడంతో అమ్మ ఒంటరిదైంది. తనకు ఒక మగ తోడు ఉన్నాడు అన్న భావం ఆడదానిచేత ఎంతటి పనైనా చేయిస్తుందేమో! అందుకే కాబోలు అమ్మ నన్ను ఉత్తముడిగా మంచి ఉద్యోగస్థుడిగా తయారు చేయడం కోసం పగలు రాత్రి వంటలు చేసి ప్రతీ పైసా కూడబెట్టింది. ఆమె ఆశీర్వాదబలం వల్ల నాకు రైల్వేలో క్యాంప్ క్లర్క్ ఉద్యోగం వచ్చింది. అంతా ఆమె పుణ్యమే.

అనుకోకుండా పాలకొల్లు కేంప్‌ను వెళ్లిన నేను, ఒక బట్టల షాపులో తొలి సంపాదనతో అమ్మకు చీర కొందామని వెళ్లాను.

అక్కడ "నర్మద" ను చూశాను.

వచ్చిన కష్టమర్స్ అందరికీ "నర్మద" శారీస్ చూపిస్తోంది. ప్రతీ శారీని సగం మాత్రమే విప్పి దానిని అందంగా ప్లేట్స్ పెట్టుకొని పమిట వేసుకొని మిగతా భాగంతో కుచ్చిళ్లు పెట్టి తన చీరమీద అలవోకగా కట్టుకుని చూపిస్తుంటే ఆమె మాటల చాకచక్యానికి, ఆ చీర కట్టుకుని నిలబడిన భంగిమకు ముగ్ధులై ఒకటి బదులు రెండు మూడు చీరలు పేక్ చేయించుకొని తీసుకువెళ్ళడం కళ్లారా చూశాను.

దానికి కారణం ఆమె "అత్యద్భుత సౌందర్యం!"

మనసంతా లగ్నంచేసి ఒక చిత్ర కారుడు గీసిన బొమ్మలా, తన కలలరాణిని అపురూపమైన శిల్పంగా చెక్కిన శిల్పిచేతి నైపుణ్యంలా నర్మదని చూస్తూనే దగ్గరగా వెళ్ళాను.

"ఏం కావాలి?" అంది ఆమె. తీపి కొబ్బరిముక్కల్లా ఉన్నాయి ఆమె మాటలు.

"చీర ఒకటి కావాలి. మీకు చాలా బాగా నచ్చిన చీర. ఎంత ఖరీదైనా సరే!" అన్నాను.

లేత అరటిఆకు రంగులో రెండువేళ్ల జరీ అంచుతో, ముక్కుపొడుం రంగు బుట్టా ఉన్న చెంధేరి జరీ చీర తీసి ఇచ్చింది.

"ఇది బాగుంటుంది. అన్నట్టు ఎవరికి?"

"మా అమ్మగార్కి!"

"నా ఎక్స్‌పెక్టేషన్ కరక్టే. కట్టుకుని చూపించనా!"

"వద్దుగానీ! మీకు నచ్చిన మీ వయస్సు అమ్మాయికి సరిపోయే చీర చూపించండి!" అన్నాడు.

ఆమె సెలక్ట్‌చేసిన దట్టమైన మబ్బురంగు చీర మీద ఉన్న చిన్నచిన్న తెల్లని పూలు ఆ చీరకు మరింత అందాన్నిచ్చి మరీమరీ చూడాలన్పించేలా ఉంది.

"ఈ చీర మీరు కట్టుకుని సాయంత్రం గుడికి రండి. మీకు అభ్యంతరం లేకపోతేనే! మరోలా భావించకండి! లవ్ ఎట్ ఫస్ట్ సైట్ అంటే ఇదేనేమో! మీరు నాకు నచ్చారు. నేను మీకు నచ్చితే క్షీరా రామలింగేశ్వరుని సాక్షిగా మిమ్మల్ని వివాహం చేసుకొని మావూరు తీసుకువెళ్తాను."

ఆమె నిశ్చేష్టురాలైపోయింది.

"మీ ఫ్రాంక్‌నెస్ నాకు నచ్చింది. ఎనీహౌ! సాయంత్రం గుడికి వస్తాను."

అమ్మచీర పేక్ చేయించి, రెండు చీరలకు డబ్బు చెల్లించి, బయటపడ్డాను.

ఆ సాయంత్రం కోవెలకు వచ్చిన నర్మదను చూస్తుంటే నా అదృష్టానికి నేనే మురిసిపోయాను.

ఆమెకు తల్లి, తమ్ముడు తప్ప వేరెవరూలేరు.

ఆ సాయంత్రం వారి సమక్షంలోనే ఆ గుడిలోనే ఆమె మెడలో తాళి కట్టాను.

నర్మదను, నన్ను చూస్తూనే అమ్మ సంబరపడి పోయింది.

దిష్టి తీసింది. భోజనాలు అంటూ చుట్టుప్రక్కల వాళ్లనందరినీ పిలిచి నానా హడావుడి చేసింది. నడుం పడిపోయేలా చాకిరీ చేసింది. నర్మదని ఏ పని చెయ్యనివ్వలేదు.

ఆ రాత్రి గదిలోకి వెళ్లబోతూ అమ్మ ఒడిలో పడుకుని అడిగాను.

"అమ్మా! నా మీద కోపం లేదూ!"

"లేదురా నాన్నా! నాకెందుకు కోపం?

నీ మనస్సుకు నచ్చిన అమ్మాయిని చేసుకొని సుఖంగా సంసారం చేస్తుంటే నాకు కావలసిందేముంది చెప్పు? నీ ఆనందమే నాకు పరిపూర్ణమైన తృప్తి. అమ్మాయి గదిలో ఉంది. వెళ్లు! బెదరకొట్టకు" నా తల నిమురుతూ అంది.

అలా గదిలోకి, నర్మద జీవితంలోకి ప్రవేశించిన నేను ఇద్దరు బిడ్డల తండ్రయ్యాను మూడేళ్లలోనే!

అమ్మ వంటలు చేయటం మానలేదు.

"నువ్వు వంటలు చేయడానికి వెళ్తే నాకు బావుండలేదమ్మా" అన్నాను ఓరోజు.

"తప్పేముందిరా నాన్నా! ఎదుగుతున్న సంసారం! వేన్నీళ్లకు చన్నీళ్లు తోడైనట్టుగా ఉంటుందని. నావల్ల నీకు అప్రతిష్ఠ వస్తుందనుకుంటే మాత్రం తక్షణం మానేస్తాను." అంది.

"ఇంట్లో నన్ను ఒక్క పని చెయ్యనివ్వరు.

అన్నీ ఆవిడే చేసుకుంటారు. ఆవిడ చేస్తేనే ఆమెకు తృప్తట. పోనీ కాలక్షేపంగా ఉంటుంది చెయ్యనివ్వండి. ఆమె ఇంట్లో లేనప్పుడు అయినా నేను ఆవనీ ఈ పని నేర్చుకోవడానికి వీలవుతుంది.'' అంది నర్మద.

రెండు పురుళ్లూ నర్మద నా ఇంట్లోనే పోసుకుంది. మా అత్తగారు ఏడోనెలలో వచ్చి పురుడు అయ్యాక అయిదోనెలలో వెళ్లేవారు. మాబావమరిదికి జెడ్.పి.లో హిందీ పండిట్‌గా సెలక్ట్ అయి జాబ్ రావడంతో ఆమె అటూ ఇటూ తిరుగుతుండేది.

రానురాను నర్మద ప్రవర్తనలో బాగా మార్పు వచ్చింది. అమ్మ మీద విసుగు చిరాకు ఎక్కువ అయ్యాయి. ప్రతీదానికి ఏదో ఒక వంకతో అమ్మని దెప్పుతూ ఉండేది. ఆమె పట్ల అమితమైన ప్రేమ ఉన్నా, నన్ను నమ్ముకొని వచ్చిన భార్యను "నాతి చరామి'' అన్న మంత్రానుసారం ఏమీఅనలేక ఇబ్బందులు పడసాగాను.

అయితే అమ్మ నర్మద దెప్పుడు మాటలు భరించలేకపోయేది.

"నీకు ఏమన్నా అనాలని ఉంటే డైరక్టుగా అనేయ్! అంతేగాని వాళ్లమీద వీళ్లమీద వంకలు పెట్టి అంటే నాకు చాలా బాధగా ఉంటుంది.'' అనేది అమ్మ. డైరెక్టుగా ముక్కుకు సూటిగా మాట్లాడటం అమ్మకు ఇష్టం.

"నేను మిమ్మల్నేమన్నానత్తయ్యా! లోకం పోకడ చెబుతున్నానంతే!'' అంటూ తప్పించుకునేది నర్మద.

నాకు కూడ ఆఫీసులో వర్క్ ఎక్కువగా ఉండటంతో అమ్మని పట్టించుకునే అవకాశమే లేకపోయింది. వారంరోజుల క్రితం రేణిగుంట కేంప్‌కు వెళ్లిన నేను ఆరోజే వచ్చాను.

దాని ఫలితమే అమ్మ అనారోగ్యం పాలవడం.

★★★

అమ్మని తీసుకుని ఇంటికి వచ్చేసరికి నర్మద ప్రక్కింటి రమణమ్మగారితో పకపకా నవ్వుతూ కబుర్లు చెబుతోంది.

రిక్షాలోంచి దిగుతున్న అమ్మని చూస్తూనే రమణమ్మగారు గబగబా ముందుకొచ్చి జబ్బ పుచ్చుకుని అమ్మని దించి నెమ్మదిగా తీసుకెళ్లి లోపల మంచంమీద పడుకోబెట్టింది.

"అరే! వారం రోజుల్నించి జ్వరమా! నాకు ఒక్కసారి మీ మనవడితో కబురుచేస్తే వచ్చి నాకు తోచిన సాయం చేద్దును కదా బాగా జ్వరంగా ఉంది. మీరు పడుకోండి వదినగారు. మీ కోడలు మాట వరసకైనా అనలేదు నాతో. మళ్లీ సాయంత్రం వస్తాను. వస్తాను మురళీ!'' అమ్మని పలకరించి ఆవిడ వెళ్ళిపోయింది నాతో చెప్పి.

ఇంత జరుగుతున్నా నిర్లక్ష్యంగా అమ్మని చూసి విసురుగా లోపలికి వెళ్లబోతున్న నర్మదని అడిగాను.

"నర్మదా! ఇందాక ఎక్కడికి వెళ్లావు?

అమ్మ అంత జ్వరంతో ఒళ్లు కాలిపోతూ మంచంలో పడి ఉంటే కాస్త ప్రక్కన ఉండొచ్చుకదా. రోజూ ఉండే పెత్తనాలేగా'' అన్నాను విసుగ్గా.

నేను ఊహించనంత వేగంగా రెచ్చిపోయింది నర్మద.

''అంటే! నేను రోజూ కొంప వదిలి పెత్తనాలకు వెళ్తున్నాననేగా అర్థం. మీతో అలా చెప్పారన్న మాట ఆవిడ. బాగుందండీ. చాలా బాగుంది. వంటల పేరుతో రోజూ ఇల్లు విడచి వెళ్లేది ఆవిడ. కేంపుల పేరుతో కొంప వదిలి పోయేది మీరు. ఆ ఇద్దరు వెధవ పిల్లలకు చాకిరీ చేసుకుంటూ కూపస్థ మండూకంలా నేను మాత్రం కొంపలో పడి ఏడవాలి ఓ సరదా ఉండదు. ఓ ముద్దూ ముచ్చట ఉండదు. కాస్సేపు బయటకు వెళ్లడం ఉండదు. సంవత్సరానికి ఒకసారైనా ఓ తీర్థయాత్రైనా ఉండదు. అయినా నా పిల్లల్ని నాకు కాకుండా చేయాలని మీ అమ్మగారి ఆలోచన...''

''నీ పిల్లల్ని నీకు కాకుండా చేస్తే ఏం వస్తుంది ఆవిడకు?'' సీరియస్‌గానే అడిగాను.

''ఏం వస్తుందా? వాళ్లు నా మాట వినకుండా కొంపలో ఉన్నంతసేపు 'బామ్మా, బామ్మా' అంటూ ఆవిడ వెనకాలే పడతారు. నేనేం పెట్టినా వాళ్లకు నచ్చవు. బామ్మ అయితే బాగా చేస్తుందంటారు. ఆమెకు చేసే ఓపిక లేకపోతే వాళ్లకు చిల్లర డబ్బులు అలవాటు చేస్తున్నారు. వాళ్లు నాకు కాకుండా పోతున్నారంటే ఇంతకన్నా నిదర్శనాలు ఏం కావాలి? యింతకీ ఏమన్నాడు డాక్టరు?''

''అమ్మకు ఈ జ్వరం ఎప్పటినుంచి వస్తోంది?''

''ఏమో నాకేం తెలుసు?''

''చూడు! మనం సుఖంగా ఉన్నా మంటే అంతా అమ్మ చలవే. అటువంటి ఆవిడకు జ్వరం ఎప్పటినుంచి వస్తోందో కూడా ఒళ్లు తెలియనంతగా ఉన్నావన్నమాట. ఆరునెలల నుంచిపైగా వస్తోందట. కనీసం ఈ విషయమైనా నీకు తెలుసా?'' కోపంగా అన్నాను.

''ఆఁ..! తెలుసు! తెలిస్తే! మొదట సారి ఆరునెలల క్రితం జ్వరం వచ్చినప్పుడు మనవూళ్లో ఆర్.ఎం.పి. డాక్టరును తీసుకువచ్చి ఇంజక్షన్స్ కూడా చేయించాను. మీకు తెలుసా ఈ సంగతి? ఇన్ని చెప్పినావిడ ఆ విషయం చెప్పలేదా?''

''మతి లేకుండా మాట్లాడకు. ఒంటిమీద స్పృహ లేకుండా ప‌ే.అన్నీ చెప్పిందని పదేపదే ఆవిడనే ఆడిపోసుకుంటావెందుకు? అయినా రిక్షా ఎక్కి పది రూపాయిలిస్తే టౌనుకు వెళ్తాం. టౌనుకు తీసుకెళ్లి చూపించవచ్చుగా!''

''ఆ పనేదో మీరే చేసారుగా! ఏమైందిప్పుడు?''

''ఏమైందా? ఆరునెలలు లేటయింది. మా అమ్మకి ఎయిడ్స్‌ట, హెచ్.ఐ.వి. పాజిటివ్ సోకిందట! సివియర్ గానే ఉందట కండిషన్''

అన్నాను వణుకు తున్న కంఠంతో.

ఒక్క క్షణం కొయ్యబారిపోయింది నర్మద!

కళ్లల్లో గిర్రున నీళ్లు తిరుగుతుండగా గబగబా లోపలకు వెళ్లిపోయింది.

పది నిమిషాలలో పెట్టెతో సహా బయటకు వచ్చింది.

ఈ సారి ఆశ్చర్యపోవడం నా వంతైంది.

"నర్మదా! ఏమిటిది? ఎక్కడకి?" విస్తుపోతూ అడిగాను.

"ఎక్కడికా! ఈ ఇంట్లో ఇంక ఒక్క క్షణం కూడా ఉండను. అభం శుభం తెలియని నా పిల్లలకు కూడా మందులేని ఆ పాపిష్టిరోగం అంటుకోకుండా ఉండాలంటే ఇది ఒక్కటే మార్గం."

"నువ్వు ఆలోచించే అంటున్నావా ఆమాట!"

"అవును! బాగా ఆలోచించే అంటున్నాను. వంటల పేరుతో ఎక్కడెక్కడో తిరిగి, లేనిపోని రోగాలంటించుకొని వచ్చి..."

"నోర్ముయ్!" లాగి బలమంతా ఉపయోగించి చాచికొట్టాను నర్మద చెంపమీద!

ఆ దెబ్బకు ఆమె మూడడుగుల దూరంలో పడిపోవడమేకాదు. రెండు క్షణాలలోనే ఆమె చెంపమీద నాలుగువేళ్ల వాతలూ తేలి, తేనే రంగులో స్పష్టంగా కనిపించసాగాయి.

"నువ్వు మనిషివా! పశువ్వా! ఆలోచించే మాట్లాడుతున్నావా నువ్వసలు? మా అమ్మని అంతమాట అంటావా!" కోపంతో వూగిపోతూ అరిచాను.

"అంటాను అంతకంటే పదిమాటలు ఎక్కువే అంటాను. ఎంతసేపూ అమ్మా! అమ్మా! అంత అమ్మే కావాలనుకుంటే నన్నెందుకు పెళ్లి చేసుకుంటానని తయారై నా బ్రతుకు నాశనం చేశారు? క్యాంపుల పేరుతో మీరు మాత్రం బయట చెడుతిరుగుళ్ళు తిరగడంలేదని నమ్మకం ఏమిటి? మీరూ ఆ తల్లికి కొడుకేగా!" లేచి చీరకొంగును నడుంచుట్టూ బిగించి కంఠ నరాలు తెగేలా అరుస్తున్న నర్మద నోట్లోంచి వస్తున్న ప్రతీ మాటా నన్ను పదునైన బ్లేడుతో కోస్తున్నట్లుగా ఫీలయ్యాను. ఛీ! ప్రేమించి పెళ్ళి చేసుకున్న భర్తను అసహ్యాకరభావంతో ఎంత నీచంగా మాట్లాడింది? ఇంక తన మొహం కూడా చూడాలనిపించలేదు నాకు.

"అదే మాట నీ కోడలు నిన్ను అన్ననాడు తెలుస్తుంది. ఛీ! అందం ఆడ దానికి శాశ్వతం కాదు. దానిని చూసుకొని మిడిసిపడుతున్న నువ్వు ఇంతకు ఇంతా అనుభవిస్తావు. వెళ్లు! తక్షణం నా ఇంట్లోంచి పో!" ఆవేశంతో వూగిపోతూ అన్న నేను సర్పద్రష్టలా ఆగిపోయాను.

దురదుష్టం నన్ను వెంటాడు తోందేమో! అపుడే స్కూలు నుంచి రిక్షా దిగి లోపలికి

వస్తున్న బాబు, పాపలను తీసుకొని, పెట్టెతో సహా అదే రిక్షా ఎక్కి నర్మద వెళ్లిపోతుంటే నేను స్థబ్దుడనై అలాగే ఉండిపోయాను.

ఇంత జరుగుతున్నా అమ్మ కట్టెలా స్పృహ లేకుండా పడే ఉంది దీర్ఘంగా శ్వాస తీస్తూ!

★★★

ఆ సాయంత్రం నాకు తెలిసిన భయంకర రహస్యం.

మా వూరి కరణంగారి అబ్బాయి పోతురాజు మంచి జల్సారాయుడు. సకల గుణాభిరాముడు. ఎయిడ్స్‌తో మరణించాడట. ఎన్నో పట్టణాలు, నగరాలు తిరిగినా ఫలితం లేకపోయిందట.

ఆఖరికి మా వూరి ఆర్.ఎం.పి. డాక్టర్ పర్యవేక్షణలో చనిపోయాడు. అదే మావూరిలో మొదటి ఎయిడ్స్ కేసు.

రెండవ కేసు అమ్మదే అవుతుంది.

అంటే అమ్మని పోతురాజు వంటల కెళ్లినపుడు ఏమన్నా చేసి ఉంటాడా?

ఆ భయంకర వూహ భరించ లేకపోయాను. ఛీ..కన్నతల్లి గురించి ఎంత హీనంగా ఆలోచిస్తున్నాను? ఆరునెలలు సావాసం చేస్తే వారి బుద్దులు వీరికి వచ్చి నట్టుంది నాపని. ఎందుకైనా మంచిదని ఆర్.ఎం.పి.ని కలిసాను.

"అన్నట్టు మీ అమ్మగార్కి ఎలా ఉందోయ్?" అడిగాడు అతను.

"బాగానే ఉంది గానీ, మా అమ్మగార్కి ఒంట్లో బాగుండనట్లు మీకెలా తెలుసు?" ఆశ్చర్యపోతూ అడిగాను.

"యిందాక రమణమ్మగారు కనిపించి చెప్పారోయ్! ఆరునెల్లక్రితం ఓ రోజు నేను పోతురాజు ఇంటి దగ్గర ఉంటే మీ ఆవిడ అర్జంటుగా రమ్మని కబురు చేసింది. వాడికి ఇంజక్షన్ చేసి సరాసరి మీ ఇంటికి వస్తినికదా, మీ అమ్మగారు తీవ్ర జ్వరంతో బాధపడుతున్నారు. అర్జంటుగా ఇంజక్షను, మందులూ వ్రాసి ఇచ్చాను. మీ ఆవిడ డబ్బులు లేవంది. సరేకదా అని నా దగ్గర ఉన్న మందునే ఇంజక్షన్ చేశాను. ఆ తర్వాత జ్వరం తగ్గాక మీ అమ్మగారు నాకు డబ్బులు యిచ్చేశారనుకో అప్పట్నించి అపుడపుడు జ్వరం వస్తూనే ఉందటగా. ఎందుకైనా మంచిది పట్నంలో హాస్పిటల్‌లో చేర్పిం చేయి!" ఓ ఉచిత సలహా పారేశాడు.

నేను ఏం చేయాలో తోచక ఆలోచిస్తూ నడచి ఇంటికి వస్తూంటే ఆర్.ఎం.పి. మాటలు నాలో రివైండ్ అయ్యాయి.

అంటే...అంటే సిరంజ్ మార్చకుండా ఆ సిరంజితోనే అమ్మకు ఇంజక్షన్ చేశాడన్నమాట.

అంటే అమ్మకి హెచ్.ఐ.వి. సంక్ర మించింది ఆర్.ఎం.పి. వల్లనన్నమాట.

ఆ ఆలోచన వచ్చేసరికి నాకు బి.పి. పెరిగిపోయింది. ఏమైనా సరే ఆ ఆర్.ఎం.పి.ని నరికి పోగులు పెడదామన్నంత కోపం వచ్చింది. కాని ప్రయోజనం? అమ్మకు నా దిక్కు కూడా లేకుండా పోతుంది. అమ్మని

జాగ్రత్తగా చూసుకోవడం కంటే వేరే మార్గం లేదు - అని నిర్ణయించుకున్నాను.

హెచ్.ఐ.వి. సోకిన వారికి ఉపయోగించిన సిరంజీలు, సూదులు, కత్తులు వంటి వైద్య పరికరాలు సరిగా శుభ్రపరచకుండా ఆరోగ్యవంతులకు వాడడంవలన హెచ్.ఐ.వి. క్రిమి వారిలో చేరే అవకాశం ఉన్నట్లు పేపర్లలో చదివాను. ఆర్.ఎం.పి. జాగ్రత్త తీసుకోలేదు. హెచ్.ఐ.వి. గాలి ద్వారాగాని, క్రిమికీటకాల ద్వారా గానీ వ్యాప్తి చెందదని, ఈ క్రిమి సోకినవారు ఉపయోగించిన వస్తువులను ఉపయోగించడం వల్ల కూడా సంక్రమించదని డాక్టర్ కూడా చెప్పారు.

అమ్మకు కన్నబిడ్డగా సేవ చేసుకునే అదృష్టం, అవకాశం నాకు దక్కినందుకు ఎంతగానో సంతోషించాను. నెల్లాళ్ళ మెడికల్ లీవ్ పడేశాను.

రోజూ అమ్మకు పండ్ల జ్యూస్‌లు, టైం ప్రకారం మందులు ఇవ్వడం మొదలు పెట్టాను. అమ్మ ఒళ్లు గోరు వెచ్చని నీళ్లతో కడిగేవాడిని. అమ్మ ఓపిక చేసుకొని చీర కట్టుకునేది. అమ్మ కిష్టమైన భక్తిగీతాల క్యాసెట్లు, భగవద్గీత, విష్ణు, లలితా సహస్ర నామాల క్యాసెట్లు, అన్నీ తన మంచం ప్రక్కనే స్లోసాండ్‌లో పెట్టుకోవడం అలవాటు చేశాను. సాయంత్రం, ఉదయం అమ్మని, ప్రక్కనే ఉన్న షిరిడి సాయిరామ్ ఆలయానికి తీసుకెళ్లేవాడిని.

అమ్మకు తన అనారోగ్యం ఏమిటో తెలియకుండా జాగ్రత్తపడుతూ చేసిన శుశ్రూష వల్ల బాగానే కోలుకుంది.

అయితే అమ్మకు నర్మద నన్ను విడిచి వెళ్లిపోయిందని తెలిసి లోలోపల కుమిలిపోతున్నదని గ్రహించలేకపోయాను.

నర్మద వెళ్ళిపోయిన వారం రోజులకే విడాకుల నోటీస్ పంపింది. ఆమె కోరినంత భరణం యివ్వడానికి అంగీకరిం చాను. చాలా తొందరలోనే మాకు విడాకులు మంజూర య్యాయి. మళ్ళీ యిన్నాళ్ళకు నర్మదను చూడడం!

★★★

పూజ గదిలోకి వెళ్ళిన నర్మద ఎంతకీ రాకపోవడం, అమ్మ పఠిస్తున్న లలితా సహస్రం ఆగిపోవడంతో ఉలిక్కిపడి ఈ లోకంలోకి వచ్చాను.

నెమ్మదిగా లేచి పూజ గదిలోకి వెళ్ళాను.

నర్మద పూజా మందిరంలో, దీపకాంతిలో, సజీవంగా నవ్వుతున్నట్టు ఉన్న అమ్మ ఫోటో ముందు సాష్టాంగ ప్రణామం చేస్తున్నట్టుగా పడుకుని ఉంది.

నేను ఉలిక్కిపడ్డాను.

టేప్ రికార్డులో క్యాసెట్ ఆగిపోయి నట్టుంది. ఆఫ్ చేశాను.

నర్మదను ప్రక్కకు త్రిప్పాను.

ముక్కు దగ్గర వేలు పెట్టి చూశాను. శ్వాస ఆడుతోంది.

రామయ్య సాయంతో మంచం మీదకు చేర్చి ప్రాథమిక చికిత్స చేశాను. ఈలోగా

రామయ్య తీసుకొచ్చిన డాక్టరు గారు నర్మదని పూర్తిగా పరిశీలించి రక్తం లేకపోవడం వల్ల మరీ బలహీనంగా ఉందని మందులు వ్రాసిచ్చి వెళ్ళారు.

నా సేవలో నర్మద మరునాటి సాయంత్రానికి బాగా కోలుకుంది.

కళ్ళు తెరుస్తూనే "ఏమండీ! అత్తయ్యగారిని నేనే పొట్టన పెట్టుకున్నాను." అంటూ విలపించసాగింది.

"లేదు నర్మదా! నుదుట వ్రాసి ఉన్న వ్రాతను ఎవరూ మార్చలేరు. జీవితం అమృత కలశం లాంటిది. ఒక్కచుక్క విషం అందులో చిలికినా ఆ జీవన కలశం ఎందుకూ పనికిరానిదే! అమ్మ చావు అలా వ్రాసి పెట్టి ఉంది. అంతే! అయితే అమ్మ జీవితం ఎంతటి అమూల్యమైన గుణపాఠం నేర్పిందో చూశావుగా! అంతకన్నా అమ్మ జీవితానికి ధన్యత ఏం కావాలి? తల్లా పెళ్ళామా అని సందిగ్ధపడే నాలాంటి పిరికి వారికి నామాట ఒక్కటే. యీ జీవితం తల్లిదండ్రుల ప్రసాదం. ఈ వేళ మన అభిప్రాయాన్ని స్వేచ్ఛగా తెలియచేసేటంత జీవితాన్ని ఇచ్చి, మనం పుట్టిన నాటినుంచీ ఎన్నో కష్టాల కోర్చి మనను ఇంత వాళ్లను చేసిన అమ్మ తరువాతే ఎవరైనా సరే! నీ బిడ్డలు కూడా తమ తప్పు తెలుసుకుని నీ ఒడిలోకి చేరే రోజు ఎంతోదూరంలో లేదు నర్మదా! పశ్చాత్తాపానికి మించిన ప్రాయశ్చిత్తం మనిషికి మరేదీ లేదు. యిన్నాళ్ళకైనా నీ తప్పు తెలుసుకొని నన్ను చేరుకున్నావు. మనం ఒకరికొకరు నిజంగా అవసరమయ్యేది ఈ వయస్సులోనే. నువ్వు ప్రశాంతంగా రెస్ట్ తీసుకో!" ఆమె నుదుట చెయివేస్తూ అన్నాను. నాచేతిని తన చంపకు చేర్చుకుని కళ్ళుమూసుకున్న నర్మదను, నన్ను ఆశీర్వదిస్తున్నట్టుగా ఫోటోలోంచి అమ్మ చిరునవ్వులు చిందిస్తోంది. ●

'ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక'
29-09-2001